సాక్షి
ప్రకాశం

శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



ఉత్తమ సేవలకు ప్రశంస

జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన వేడుకల్లో అవార్డులు అందజేశారు. - 8లో..



జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డికి జాతీయ అవార్డు

ఒంగోలులోని జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డిని ప్రెసిడెంట్స్ కరెక్షనల్ సర్వీసెస్ మెడల్ వరించింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
36/28

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.





ఒంగోలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్య్ర దిన వేడుకల్లో దేశభక్తి గీతాలకు డ్యాన్స్ చేస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు

ఊరూరా త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. జిల్లా అంతటా స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు అంబరాన్ని తాకాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేటు సంస్థల్లో మువ్వన్నెల జెండాలు ఆవిష్కరించి గౌరవవందనం చేశారు. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకున్నారు. వివిధ విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థుల ర్యాలీలు, దేశభక్తి నినాదాలు స్వాతంత్య్ర స్ఫూర్తిని రగిలించాయి. చిన్నారులు మహనీయుల వేషధారణలో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

త్రివర్ణ పతాకం.. నిలువెత్తు శిఖరమై..

- ఊరూ..వాడా అంబరాన్నంటిన జెండా పండుగ సంబరాలు
- పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా స్వాతంత్య్ర దిన వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



భరతమాత వేషధారణలో విద్యార్థిని



ఒంగోలులోని జెడ్పీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



జాతీయ జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, పక్కన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ, జేసీ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఎందరో మహానుభావుల పోరాటం, త్యాగం, కృషి ఫలితమే 1947 ఆగస్టు 15వ తేదీ మనకు వచ్చిన స్వాతంత్య్రం అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఏఆర్ డీఎస్పీ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ కవాతు అందరినీ ఆకట్టుకుంది. అనంతరం మంత్రి డాక్టర్ డోలా మాట్లాడుతూ మహనీయుల అలుపెరుగని పోరాటం వలనే స్వాతంత్య్రం సిద్ధించిందని తెలిపారు. స్వాతంత్య్ర సమరయోధులకు నమస్సుమాంజులు, అమరవీరులకు నివాళులు అర్పిస్తున్నామన్నారు. మహానుభావులు మనకు స్వాతంత్య్రాన్ని సిద్ధింపజేస్తే.. దేశ సరిహద్దుల్లో వారి జీవితాలను పణంగా పెట్టి దేశాన్ని కంటికి రెప్పలా సైనికులు కాపాడుతున్నారన్నారు. పేదరిక నిర్మూలన, మౌలిక సౌకర్యాల అభివృద్ధి, వనరుల సమర్థ నిర్వహణ, ఈజ్ ఆఫ్ లివింగ్ అనే నాలుగు అంశాలను ప్రధానంగా తీసుకుని జిల్లాలో 15 శాతం వృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించటం జరుగుతోందన్నారు. జిల్లాను వెనుకబడిన జిల్లాగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని, అభివృద్ధి చేయడం కోసం ప్రత్యేక ప్యాకేజీ కింద ఏడాదికి రూ.50 కోట్లు మంజూరు చేసిందని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 45 రోజుల పాటు సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్ కోసం రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. 2024–25 సంవత్సరానికి జిల్లాలో 45 వేల సాగుదారు ధ్రువీకరణ పత్రాలు(సీసీఆర్‌సీ కార్డులు) మంజూరు చేసే లక్ష్యంగా నిర్దేశించుకుని ఇప్పటి వరకు 17,785 జారీ చేశామన్నారు. గృహ నిర్మాణ పథకం కింద జిల్లాలో 16,057 గృహాలకు గానూ రూ.289.02 కోట్లు ఖర్చుచేసి డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. మరో 25,815 గృహాలను 2025 జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మార్కాపురం పట్టణం రాయవరంలో నూతన మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం నాబార్డు ఆర్‌ఐడీఎఫ్–28 పథకం కింద రూ.475 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అన్ని వసతులతో తీర్చిదిద్దేందుకు 'మన బడి–మన భవిష్యత్తు' పేరుతో ఫేజ్–2ఏకి జిల్లాలోని 1,069 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. వాటిలో రూ.3,117.58 కోట్లతో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని మూడు రైతు బజార్లలో, డీ–మార్టుతో పాటు మరికొన్ని ప్రదేశాలలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి కందిపప్పు కేజీ రూ.150, స్టీమ్ రైస్ కేజీ రూ.48, రా రైస్ కేజీ రూ.47 చొప్పున విక్రయించడం జరుగుతుందన్నారు. ఎంఎస్ఈ–సీడీపీ పథకంలో జిల్లాలో 2024–25 సంవత్సరానికి కార్పెంటర్ క్లస్టర్ కనిగిరిలో, లీఫ్ ప్లేట్ తయారీ క్లస్టర్ నూతలపాడులో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడానికి 2024–25 సంవత్సరం మొదటి 8 నెలలకుగానూ ప్రభుత్వం రూ.199.16 కోట్లు కేటాయించిందన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పిల్ వే గేట్లకు మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ విభాగాల శకటాలు, స్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులను మంత్రితో పాటు కలెక్టర్, ఎస్పీ కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్, ఏఎస్పీలు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలో చిన్నారులు



స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న మంత్రి డోలా

దేశభక్తిని చాటిచెప్పిన సాంస్కృతిక కార్యక్రమాలు...

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్య్ర దినోత్సవంలో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఒంగోలుకు చెందిన డ్రీమ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ఏ జెండా ఏ జెండా అనే పాటకు ప్రథమ బహుమతి, బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ఎలుగెత్తి పాడరా వందేమాతరం అనే నృత్యగీతానికి ద్వితీయ బహుమతి, గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన వందేమాతరం పాటకు తృతీయ బహుమతి లభించాయి. విద్యార్థుల ప్రతిభకు ఆ ప్రాంతం చప్పట్లతో మార్మోగింది.



దేశభక్తి గీతానికి నృత్యం చేస్తున్న నారాయణ స్కూల్ విద్యార్థిని



అటవీశాఖ స్టాల్లో పామును తిలకిస్తున్న విద్యార్థులు



స్టాల్స్‌ను తిలకిస్తున్న ప్రజలు



ఒంగోలు బండ్లమిట్ట ప్రభుత్వ బాలికల హైస్కూలు విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఆకట్టుకున్న స్టాల్స్..

ఒంగోలు టౌన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. మహిళా శిశు సంక్షేమ శాఖ, మెప్మా, పరిశ్రమల శాఖ, విద్యా శాఖ, మత్స్య శాఖ, వ్యవసాయ శాఖ, మైనింగ్ శాఖలు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్‌ను మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఉద్యోగులు స్టాల్స్ ప్రత్యేకతలను వివరించారు. రెడ్ క్రాస్ ఏర్పాటు చేసిన స్టాల్‌లో సందర్శకులకు సీపీఆర్‌లో అక్కడికక్కడే శిక్షణ ఇచ్చారు. పలువురు విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించి వారికి రిపోర్టు అందజేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌కు ప్రథమ బహుమతి, అటవీ శాఖ స్టాల్‌కు ద్వితీయ బహుమతి, రెడ్‌క్రాస్ స్టాల్‌కు తృతీయ బహుమతి ప్రకటించిన అధికారులు.. వారికి మెమెంటోలు అందజేశారు.



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

న్యూస్‌రీల్

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 'ఎట్ హోమ్'



ఎట్ హోమ్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఒంగోలు సిటీ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 'ఎట్ హోమ్' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, విందు ఏర్పాటు చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎస్పీ దామోదర్, జేసీ గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫోన్ పే ద్వారా బిల్లుల చెల్లింపు

ఒంగోలు సబర్బన్: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఇక నుంచి ఫోన్ పే ద్వారా కూడా చెల్లించవచ్చని ఏపీసీపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ తెలిపారు. ఆ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఫోన్ పే ద్వారా చెల్లించేందుకు సంబంధిత విద్యుత్ కార్యాలయాల్లోని అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

స్వాతంత్య్ర ఫలాలు అందరికీ అందాలి



యర్రగొండపాలెంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: స్వాతంత్య్రం కోసం మహనీయులు ప్రాణత్యాగాలు చేసి సాధించిన ఫలాలు అందరికీ అందాల్సిన అవసరం ఉందని, అటువంటి పరిస్థితి దేశంలో కనిపించడం లేదని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం యర్రగొండపాలెంలోని కొలుకుల రోడ్డులో గల వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విభిన్న కులాలు, మతాలు, వర్గాలకు చెందిన తామందరం అన్నదమ్ముళ్లగా కలిసి ఉంటున్నామని, అటువంటి దేశంలో పుట్టిన తాము రాజకీయ వైషమ్యాలతో అట్టడుకుపోతున్నామని అన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో పేదలకు స్వాతంత్య్ర ఫలాలు అందడం లేదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఒక వర్గానికి చెందిన వారికే అందేవిధంగా చర్యలు తీసుకోవడం శోచనీయమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే రాష్ట్రంలో అరాచకాలు పెచ్చరిల్లాయని, హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు పెరిగిపోతున్నాయని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత, స్వాతంత్య్ర సమరయోధుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కూలదోయడానికి ప్రయత్నించినప్పటికీ దోషులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్రంలో శాంతి, భద్రతల వైఫల్యం ఇట్టే అర్థమవుతోందన్నారు. గత ప్రభుత్వంలో కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందేవని, శాంతి, భద్రతలతో ప్రజలకు భరోసా ఇచ్చిన సీఎం.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, యేర్వ చలమారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, ఎస్.పోలిరెడ్డి, గంటా రమణారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఏఎంసీ డైరెక్టర్ కె.సత్యనారాయణ చౌదరి, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సూరె ప్రసాద్, వివిధ విభాగాల నాయకులు సూరె రమేష్, ఎస్.వెంకటరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, బి.బాలచెన్నయ్య, రాములు నాయక్, ఆర్.అరుణాబాయి, డి.సుబ్బారెడ్డి, తమ్మినేని సత్యనారాయణరెడ్డి, సరళకుమారి, ఎం.కరిముల్లాబేగ్, ఆవుల కోటిరెడ్డి, ఎల్.రాములు, జానకిరఘు, కె.నాగార్జునరెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, ఎస్.సుందరరాజు, షేక్.వలి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ స్వరాజ్యం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. జిల్లా ప్రజలందరికీ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జంకె మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలను లెక్క చేయకుండా ఎందరో త్యాగధనులు చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. వారు కోరుకున్న బాటలో గ్రామాల అభివృద్ధే లక్ష్యంతో నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి, అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. అందులో భాగంగానే సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు, నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలను గ్రామాల్లో అభివృద్ధి చేశారన్నారు. వాటి ద్వారా ప్రజలకు అనేక సదుపాయాలు కల్పించారన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలిచాయన్నారు. 2019 నుంచి 2024 వరకు తన పరిపాలనలో ఏ విషయంలోనూ రాజీపడకుండా అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగారన్నారు. ఒడా మాజీ చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రెండున్నర సంవత్సరాలు కరోనా పీడించినప్పటికీ రాష్ట్ర ప్రజలకు అన్నివిధాలుగా అండగా నిలిచారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలు అమలుచేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యదర్శి దామరాజు క్రాంతి కుమార్, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ బొట్ల సుబ్బారావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, రైతు సలహా సంఘ మాజీ అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రారెడ్డి, బీసీ సంఘ నగర అధ్యక్షుడు సుతారం శ్రీనివాసులు, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నలబోతుల కొండయ్య, నాయకులు రాయపాటి అంకయ్య, గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి, అంగిరేకుల గురవయ్య, దుగ్గిరెడ్డి ఆంజనేయరెడ్డి, దాసరి కరుణాకర్, కొండారెడ్డి, తోటపల్లి సోమశేఖర్, చావలి శివ, కొండూరి నవీన్, ఫణిదపు సుధాకర్, స్వరూప్, పాలపర్తి సుబ్బారావు, పందీటి జేమ్స్, రాయని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



దర్శిలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

జాతీయ జెండాలు ఆవిష్కరించిన బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి...

ఒంగోలు సిటీ: 78వ స్వాతంత్య్ర దినోత్సవంలో భాగంగా ఒంగోలులోని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశానికి స్వాతంత్య్రం రావడానికి ఎందరో మహానుభావులు త్యాగాలే కారణమని ఆమె అన్నారు. ప్రజలందరికీ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా దర్శిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. ఒంగోలులోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో జాయింట్ కలెక్టర్, ది ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఒంగోలు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ రోణంకి గోపాలకృష్ణ జాతీయ జెండా ఆవిష్కరించారు. బ్యాంకు సీఈఓ కోటిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



పీడీసీసీబీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఉత్తమ సేవలకు ప్రశంస

- అధికారులు, 59 మంది పోలీసులకు ప్రశంస పత్రాలు
- మంత్రి డోలా, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్ చేతుల మీదుగా అందజేత



మంత్రి డోలా, కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకుంటున్న రాహుల్ మీనా(మార్కాపురం సబ్ కలెక్టర్), జాన్‌ఇర్విన్(ఆర్డీఓ, కనిగిరి), టి.వసుంధర(పీడీ, డీఆర్‌డీఏ), డాక్టర్ కె.బేబీరాణి(జేడీ, పశుసంవర్ధకశాఖ), ఎ.ఉదయబాస్కర్(డీఎస్‌ఓ), ఎంవీ సత్యనారాయణ(డీఎం), షేక్ మర్దాన్ అలీ(ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్), జి.అర్చన(ఏడీ, డిజేబుల్ వెల్ఫేర్), వి.విశ్వేశ్వరరావు(ఇన్‌చార్జి డీఆర్‌ఓ), వైఎంఎస్‌వీఎస్ గోపీచంద్(డీహెచ్‌ఓ) , ఎస్.అబుతలీమ్(ఎస్ఈ, ప్రాజెక్ట్స్), కె.మాధురి(పీడీ, ఐసీడీఎస్),



ఎంవీఎస్ లోకేశ్వరరావు(ఎఫ్ఎస్‌ఓ), ఎ.చంద్రశేఖరరెడ్డి(డీఎఫ్‌ఓ), డి.వెంకటేశ్వర్లు(సీపీఓ), భరధ్వాజ్(జిల్లా ఉపాధి అధికారి), టి.ఉషారాణి(ఇన్‌చార్జి డీపీఓ), ఎన్.లక్ష్మానాయక్(సోషల్ వెల్ఫేర్ డీడీ), బి.రవి(పశుసంవర్ధకశాఖ డీడీ), ఎం.జశ్వంత్‌రావు(ఓఎంసీ కమిషనర్) , బి.జగన్నాథరావు(డీఎంజీఓ), టి.రవికుమార్(పీడీ, మెప్మా), డాక్టర్ ఎం.భ్రమరాంబ(సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఆయూష్), ఎ.రమేష్(డీపీఆర్‌ఓ), కె.పవన్‌కుమార్ (లేబర్, అసిస్టెంట్ కమిషనర్), జానీ(ఎంఈ, ఓఎంసీ),



లక్ష్మణ్‌కుమార్ (ఏఆర్ డీఎస్పీ), బి.శ్రీనివాసరావు(డిప్యూటీ జైలర్), సీహెచ్.జాలయ్య(స్టేషన్ ఫైర్ ఆఫీసర్), కె.రామచంద్రరావు(ఎంవీఐ), ,శ్రీరామ్(సీఐ), డి.వంశీకృష్ణ(ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్), బి.కోటేశ్వరరావు(ఫారెస్ట్ బీట్ ఆఫీసర్) , టి.బాలాంజనేయులు (ఏఎస్ఐ) ,కేఎల్ నారాయణ(ఏఎస్ఐ), వి.శ్రీనివాసులు(ఏఎస్ఐ), ఇ.వెంకటస్వామి (ఏఎస్ఐ), టి.జాషువా(ఏఆర్ ఎస్ఐ), ఎన్.రాఘవరావు(ఏఆర్ ఎస్ఐ), సీహెచ్.నాగేశ్వరరావు (ఏఎస్ఐ), కె.శ్రీనివాసరావు(ఏఎస్ఐ),



బి.సత్యశ్రీనివాస్(ఏఎస్ఐ), బి.వెంకటేశ్వర్లు (ఎస్ఐ), బి.మరియ దాసు(డీఎస్పీ), కె.నరేష్‌కుమార్(పీసీ), వై.వెంకటేశ్వర్లు(పీసీ), ఎం.అనీల్(పీసీ), టి.మురళి(పీసీ), ఆర్.నాగేశ్వరరావు(పీసీ), పి.శ్రీహరిబాబు(హెచ్‌సీ), ఎం.శ్రీనివాసులు(హెచ్‌సీ), వై.శ్రీనివాసరావు(హెచ్‌సీ), బి.మల్లికార్జునరావు(హెచ్‌సీ), పీసీహెచ్ కేశవరెడ్డి(హెచ్‌సీ), ఎస్‌కేఎం జానీ(హెచ్‌సీ), ఆర్.నగేష్‌బాబు(ఏఎస్ఐ), పేర్ల కవిత(పంచాయతీ కార్యదర్శి)



ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, పోలీసులకు ప్రశంస పత్రాలు, మెడల్స్ వరించాయి. ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన 78వ స్వాతంత్య్ర దిన వేడుకల్లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్ చేతులమీదుగా ప్రశంస పత్రాలు, డీజీ కమాండేషన్ అవార్డులు అందజేశారు. నిజాయితీ, నిబద్ధతకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా పేర్కొన్నారు. మునుముందు మరింత ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. విశ్రాంత ఎస్పీ డీఎస్పీ బి.మరియదాసుకు 2021కిగాను డీజీ కమాండేషన్ అవార్డు అందజేశారు. పొదిలి సీఐ బి.మల్లికార్జునరావు, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ ఎం.సులోచన , ఏసీబీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శేషు తదితరులు ప్రశంస పత్రాలు అందుకున్నారు. మొత్తం 59 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి మెడల్స్, ప్రశంసా పత్రాలు దక్కాయి. ఏసీబీకి చెందిన ఇద్దరు, జిల్లా సబ్ జైలుకు చెందిన ఇద్దరు, 27 మంది పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు చెందిన ముగ్గురిని జిల్లా ఉత్తమ సేవా అవార్డులు వరించాయి. అలాగే పీటీసీకి చెందిన ముగ్గురు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు చెందిన ముగ్గురికి ప్రశంసా పత్రాలు లభించాయి.

సీఐ ఐవీ రెడ్డికి డీజీ కమాండేషన్ అవార్డు

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో అద్భుత ప్రతిభ కనబరిచిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఐ. వెంకటేశ్వరరెడ్డికి రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం డీజీ కమాండేషన్ అవార్డు ప్రకటించింది. తాళ్లూరుకు చెందిన ఐవీ రెడ్డి తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న సమయంలో పోక్సో కేసులను సమర్థవంతంగా దర్యాప్తు చేయడమే కాకుండా నిందితులకు శిక్ష పడేలా కృషి చేసినందుకు అవార్డు వరించింది. గురువారం నిర్వహించిన స్వాతంత్య్ర దిన వేడుకల్లో ఆయన అవార్డు అందుకున్నారు.

విద్యుదాఘాతానికి ఐదు గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

కొనకనమిట్ల: వేటగాళ్ల అడవి పందుల కోసం వేసిన విద్యుత్ కంచెలు తగిలి పశువుల మేతకు వెళ్లిన 5 గేదెలు మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన కొనకనమిట్ల మండలం గార్లదిన్నె చెరువు వద్ద గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గార్లదిన్నె గ్రామానికి చెందిన సానికొమ్ము వెలుగొండారెడ్డికి చెందిన 5 గేదెలు పశువుల మేతకోసం పొలాలకు వెళ్లాయి. చెరువు వద్ద మేత మేస్తున్న గేదెలు పందులు కోసం వేసిన విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ.2.50 లక్షల విలువైన గేదెలు మృత్యవాత పడటంతో గేదెలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు తీవ్ర నష్టం బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన ప్రాంతానికి కిలోమీటర్ దూరంలో విద్యుత్ లైన్ ఉంది. అడవి పందుల కోసం లైన్ లాగి ఉంటారని అన్నారు. కానీ గేదెలు మృతి చెందిన చోట తీగలు లేవని, వాటిని తొలగించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. రైతు ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులకు, పోలీసులకు సమాచారం ఇస్తామన్నారు.

జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డికి జాతీయ అవార్డు



ఐజీ నుంచి జాతీయ అవార్డు అందుకుంటున్న జిల్లా జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డి

ఒంగోలు టౌన్: జిల్లా జైల్ సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డిని ప్రెసిడెంట్స్ కరెక్షనల్ సర్వీసెస్ మెడల్ వరించింది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం విజయవాడలో జైళ్ల శాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ప్రిజన్స్(ఐజీ) డాక్టర్ ఐ.శ్రీనివాసరావు చేతులమీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరించడమే కాకుండా, సమర్థవంతుడైన అధికారిగా వరుణారెడ్డి పేరొందారని జిల్లా కారాగార సిబ్బంది పలువురు అభినందించారు.

సమానత్వంతో ప్రజలు ముందుకు సాగాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి



జిల్లా కోర్టులో జాతీయ జెండా ఎగురవేస్తున్న ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: సోదరభావం, సమానత్వంతో ప్రజలు ముందుకు సాగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి సూచించారు. గురువారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేసి ప్రజలకు 78వ స్వాతంత్య్ర దిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలను త్యజించిన మహనీయులను గుర్తు చేసుకోవాలని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అదనపు జిల్లా న్యాయమూర్తులు డి.అమ్మనరాజా, రాములు, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు, జూనియర్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల త్యాగఫలం స్వాతంత్య్రం

- ఎస్పీ దామోదర్



జిల్లా పోలీసు కార్యాలయంలో జెండావిష్కరణ చేసిన ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ఎందరో అమరవీరుల త్యాగఫలమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్య్రమని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం త్రివర్ణ పతాకాన్ని ఎగర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ఎంతో మంది ఎనలేని పోరాటాలు చేశారని, ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించారని చెప్పారు. వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ దేశ సేవకు, ప్రజా సేవకు సంసిద్ధులై ఉండాలని పిలుపునిచ్చారు. విధుల్లో రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు కార్యాలయంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న జిల్లా పోలీసు కార్యాలయం, ఎస్బీ, డీసీఆర్బీ, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోలు, డీపీఓ తదితర సిబ్బంది పాల్గొని జాతీయ పతాకానికి వందనం సమర్పించారు. ఏఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, డీసీఆర్బీ సీఐ భీమానాయక్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కులోన్మాదంపై అక్షరాయుధం మద్దూరి

- యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వినోదిని



పుస్తకావిష్కరణ సభలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ వినోదిని

ఒంగోలు టౌన్: అంబేద్కరిజం తాత్వికతను కవిత్వ అక్షరంగా పదును పెట్టి కులోన్మాద సమాజంపై ఎక్కుపెట్టిన దళిత కవిత్వ దళనాయకుడు మద్దూరి నగేష్‌బాబు..అని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎంఎం వినోదిని అన్నారు. గురువారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో బహుజన కెరటాలు ప్రచురించిన మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం పుస్తక ఆవిష్కరణ జరిగింది. సభకు సాహితీవేత్త ఆత్మకూరి బాలచెన్నయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ అణగారిన సమాజంలో వెలుగులు పూయించాలని తపనపడి సమానత్వం కోసం బతుకంతా పోరాటం చేసిన ధిక్కార కవి మద్దూరి రగిలించిన స్ఫూర్తి ఎన్నటికీ ఆరదన్నారు. వెస్ట్రన్ సాహిత్యం నుంచి ఆఫ్రికన్ సాహిత్యం దాకా, బ్లాక్ పాంథర్‌ని, దళిత పాంథర్స్‌ని గుండెల్లో పెట్టుకొని అంబేద్కర్, గుర్రం జాషువాల వారసుడిగా యుద్ధ వీరుడిగా వచ్చిన నగేష్‌బాబు సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత సభకు బహుజన కెరటాల ప్రతినిధి చప్పిడి కోటేశ్వరరావు స్వాగతం పలకగా పల్నాటి శ్రీరాములు సమన్వయకర్తగా వ్యవహరించారు. పుస్తకావిష్కరణలో సాహితీవేత్తలు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, శ్రీరామకవచం సాగర్, డాక్టర్ నూకతోటి రవికుమార్, బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు పర్రె వెంకటరావు, డాక్టర్ వినయ్, మోహన్‌కుమార్ ధర్మ ప్రసంగించారు. నగరానికి చెందిన సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల దుశ్చర్య

- బీజేపీలో చేరిన వారిపై దాడి



దాడిలో గాయపడిన రాజశేఖర్

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ నుంచి బీజేపీలో చేరిన ముగ్గురు వ్యక్తులపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన గురువారం పట్టణంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగింది. నగర పంచాయతీ కో ఆప్షన్ సభ్యుడు షేక్.మస్తాన్ వలి, కంచిపల్లెకు చెందిన పీరయ్యలను రైల్వేస్టేషన్ వద్ద టీడీపీ నాయకుడు పాలుగుళ్ల చిన్న శ్రీనివాసరెడ్డి, గుర్రాల వలీ, మరో 20 మంది కలిసి దాడికి పాల్పడ్డారు. అదే విధంగా హీరో షోరూం యజమాని రాజశేఖర్‌పై శివాజి లాడ్జి వద్ద టీడీపీ నాయకుడు ప్రవీణ్‌తో పాటు మరో 15 మంది కలిసి దాడి చేశారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దాడి హేయమైన చర్య

వైఎస్సార్ సీపీ నుంచి బీజేపీలో వారిపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడటం హేయమైన చర్య అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ ఖండించారు. ఈ ముగ్గురిని బీజేపీలో చేర్చుకునే సమయంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సోదరుడు కృష్ణకిషోర్‌రెడ్డి చేర్చుకోవద్దని చెప్పాడన్నారు. బీజేపీ అధిష్టానం నిర్ణయం మేరకు ఈ ముగ్గురితో పాటుగా మరో 10 మందిని పురంధరేశ్వరి సమక్షంలో విజయవాడలో చేర్పించామని, విజయవాడ నుంచి గిద్దలూరుకు రాగానే దాడికి పాల్పడటం దారుణమని మండిపడ్డారు. ప్రజాస్వామ్య పద్ధతిలో గెలుపొందిన పాలకులు ఇటువంటి చర్యలను పూర్తిగా వ్యతిరేకించాలని కోరారు.

అంతా మహిళలు.. మురిసిన మువ్వన్నెలు

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలోని ట్రంక్ రోడ్డు మువ్వన్నెల జాతీయ పతాకాలతో కళకళలాడింది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హర్ ఘర్ తిరంగా పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా త్రివర్ణ పతాకాన్ని చేతబూని ముందుకు కదిలారు. నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థినులు, స్వయం సహాయక గ్రూపుల మహిళలు, ఐసీడీఎస్ ఉద్యోగులు ర్యాలీలో పాల్గొన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మెప్మా పీడీ రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ పి.వసుంధర, అధికారులు హాజరయ్యారు.



ర్యాలీలో త్రివర్ణ పతాకంతో కలెక్టర్ అన్సారియా

త్యాగధనుల కృషితోనే స్వాతంత్య ఫలం



వర్శిటీ ఆవరణలో జెండా వందనం చేస్తున్న వీసీ డీవీఆర్ మూర్తి

ఒంగోలు: ఎందరో త్యాగధనుల కృషి ఫలితమే నేటి స్వాతంత్య్రమని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వీసీ, ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ఆవరణలో జాతీయ జెండా ఎగువేసి 78వ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వీసీ మాట్లాడుతూ.. వికసిత్ భారత్ నిర్మాణంలో యువతరం భాగస్వాములు కావాలన్నారు. దేశస్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ హరిబాబు, కాలేజీ ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, డీన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హర్షప్రీతం దేవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కడప సీఐ వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

- డ్రైవర్‌కు దేహశుద్ధి చేసిన మహిళలు



ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న ఏఎస్సై రాంబాబు

దర్శి: పోలీస్ వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన అద్దంకి రోడ్డులోని వీరాయపాలెం మేజర్ వద్ద గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ముండ్లమూరు మండలం పులిపాడు గ్రామానికి చెందిన చిరుగురి వెంకట్రావు అద్దంకి రోడ్డులో మోటారు సైకిల్పై పులిపాడు వైపుకు వెళ్తున్నాడు. అద్దంకి నుంచి దర్శి పట్టణంలోకి వస్తున్న కడప సీఐ వాహనం రాంగ్ రూట్‌లో వెళ్లి మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ఉన్న వెంకట్రావు ఎగిరి మూడు పల్టీలు కొట్టినట్లు స్థానికులు తెలిపారు. కారు ముందు భాగంలో మోటారు సైకిల్ ఇరుక్కు పోయింది. మోటార్ సైకిల్‌ను ఢీకొన్న వాహనం వీరాయపాలెం మేజర్‌పైన ఉన్న శిలాఫలకాన్ని ఢీకొట్టి ఆగింది. స్థానికులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. రాంగ్‌రూట్‌లో వచ్చి వాహనాన్ని ఢీకొట్టంతో మండిపడ్డారు. అంత నిర్లక్ష్యంగా ఎలా డ్రైవింగ్ చేస్తావని డ్రైవర్‌ను ప్రశ్నించగా దురుసుగా సమాధానమిచ్చారు. దీంతో పోలీసులని తెలియక కొందరు మహిళలు డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏఎస్సై రాంబాబు పోలీస్ వాహనం, మోటార్‌సైకిల్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఏమా బంధం.. ఏమా సంబరం!

- ఇసుక మాఫియాతో కలిసి ఎస్సై పుట్టినరోజు వేడుక
- సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియో



సింగరాయకొండ- ఇసుక మాఫియాతో సంబరాల్లో ఎస్సై వెంకటేశ్వరరావు

ఒంగోలు టాస్క్‌ఫోర్స్: జరుగుమల్లి మండలానికి చెందిన ఎస్సై వెంకటేశ్వరరావు ఇసుక మాఫియాతో సంబరాలు చేసుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఎస్సై వెంకటేశ్వరరావు పుట్టిన రోజు వేడుకలు గురువారం రాత్రి జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌లో జరుపుకొన్నారు. ఈ వేడుకలకు ఇసుక మాఫియా ప్రధాన సూత్రధారులు సురేష్, బాలాజీ, సుబ్బారెడ్డితో పాటు మరి కొందరు హాజరయ్యారు. ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఒక వైపు ఇసుక, గ్రావెల్, రేషన్, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని కలెక్టర్, ఎస్పీ హెచ్చరికలు జారీ చేస్తుండగా.. అక్రమార్కులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకోవడం విమర్శలకు తావిస్తోంది.